సాక్షి కర్నూలు

శనివారం ၊ 26 ၊ అక్టోబర్ ၊ 2024



పశువుల లెక్క.. ఇక పక్కా

పశుగణనకు రంగం సిద్ధమైంది. ఐదేళ్లకోసారి జాతీయస్థాయిలో పశుగణన జరుగుతుంది. ఈ మేరకు శనివారం నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి పశుగణన చేపట్టనున్నారు. 10లో▸



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి సహస్రనామ పూజలు జరిపించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,631.93
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.500
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 48,221
అవుట్ ఫ్లో	: 48,314

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల సమావేశం

- హాజరుకానున్న ఉమ్మడి జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కర్నూలు (టౌన్): కల్లూరులోని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహంలో శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఉమ్మడి జిల్లా స్థాయి వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల సమావేశం జరుగనుంది. ఈ విషయాన్ని శుక్రవారం ఆ పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. పార్టీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యే ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యులు, ఇన్‌చార్జ్‌లు, సమన్వయకర్తలు, పార్లమెంట్‌కు పోటీ చేసిన అభ్యర్థులు పాల్గొంటారని తెలిపారు. పార్టీ అభివృద్ధి, కమిటీల నియామకం తదితర వాటిపై సమావేశంలో చర్చించనున్నట్లు వారు వెల్లడించారు.

2న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో నవంబర్ 2వ తేదీన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించనున్నట్లు సీఈఓ జీ నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘి సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక, ప్రణాళిక, పనులకు సంబంధించిన శాఖలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు స్థాయీ సంఘాల చైర్ పర్సన్లు, సభ్యులు, అధికారులు తమకు కేటాయించిన సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

సారూ.. మాకు జీతాలు చెల్లించండి

- ఎస్‌ఈకి మొరపెట్టుకున్న సుంకేసుల బ్యారేజీ సిబ్బంది

కర్నూలు (సిటీ): పదినెలలుగా తమకు జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని సుంకేసుల బ్యారేజీలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డితో మొరపెట్టుకున్నారు. శుక్రవారం వారు ఎస్‌ఈని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బ్యారేజీ నిర్వహణ, తదితర పనులు చేస్తున్న తమకు జీతాలు అందించి ఆదుకోవాలని కోరారు.

డీఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులైన ఎస్.శామ్యూల్‌పాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది నూతన డీఈఓకు పూలబొకేలు అందించి స్వాగతం పలికారు. ఆ తరువాత డీఈఓ జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన డీఈఓను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా డీఈఓల బదిలీల్లో భాగంగా కర్నూలు డీఈఓగా పని చేస్తున్న కాగిత శామ్యూల్‌ను పాఠశాల డైరెక్టరేట్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఆయన శుక్రవారం రిలీవ్ అయ్యారు.

త్వరలో బీసీ హాస్టల్ పునః ప్రారంభం

కర్నూలు(అర్బన్): నగరంలోని శరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని త్వరలో పునః ప్రారంభించనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ గతంలో స్థానిక బీ క్యాంప్‌లోని ఆర్‌అండ్‌బీ క్వార్టర్లలో బీసీ, డీఎన్‌టీ బాలుర వసతి గృహాలు కొనసాగుతుండేవన్నారు. అయితే హాస్టల్ నిర్వహిస్తున్న గదులు పూర్తి స్థాయి శిథిలావస్థకు చేరడంతో అనుకూలమైన భవనం లభించేంతవరకు తాత్కాలికంగా మూసి వేశారు. సమీపంలోని వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామన్నారు. ప్రస్తుతం శరీన్‌నగర్‌లో దాదాపు 400 మంది విద్యార్థులు వసతి పొందేందుకు అనుకూలంగా ఉన్న ప్రైవేటు భవనాన్ని పరిశీలించి జిల్లా కలెక్టర్ అనుమతితో పునః ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వారం రోజుల్లో హాస్టల్‌ను ప్రారంభిస్తామన్నారు.

తెల్ల బంగారం సాగు చేసి ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కాలనుకున్న రైతులకు ప్రభుత్వ నిర్లక్ష్యం శాపంగా మారింది. రెండు నెలల క్రితం నుంచే దిగుబడులు మార్కెట్‌కు చేరుతున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతిలో మోసపోతున్నారు. జిన్నింగ్ మిల్లుల సిండికేట్ మాయాజాలంతో రైతులు నష్టపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. రైతు సంక్షేమానికి పెద్దపీట అంటూ ఎన్నికల ముందు హామీలిచ్చిన నేతలు ఇప్పుడు అన్నదాత కష్టాలు పడుతున్నా పలకరించేందుకు కరువయ్యారు.



ఎమ్మిగనూరులో జిన్నింగ్ మిల్లుల వద్ద క్యూకట్టిన వాహనాలు

సంపత్తి అంతా మిల్లులకే!

- సీసీఐ బేలచూపులు
- పత్తికి మద్దతు ధర ఒట్టిమాట
- ఉమ్మడి జిల్లాలో 2.70 లక్షల ఎకరాల్లో సాగు
- ప్రతిపాదనలకే పరిమితమైన కొనుగోలు కేంద్రాలు
- మిల్లర్ల సిండికేట్ మాయాజాలం
- దళారులతో కలసి రైతులను దోచుకుంటున్న వైనం



ఆదోని యార్డులో విక్రయానికి రైతులు తెచ్చిన పత్తి దిగుబడులు

ఎమ్మిగనూరు/కర్నూలు(అగ్రికల్చర్): పత్తి దిగుబడులు చేతికందుతున్నా మద్దతు ధర ఊసే లేదు.. కొనుగోలు కేంద్రాల జాడే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వంలో రైతు సంక్షేమం కేవలం ప్రకటనలకే పరిమితమని తేటతెల్లమవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి తీత పనులు ఊపందుకున్నా అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారీలు చెలరేగిపోతున్నారు. పత్తి క్రయ, విక్రయాలకు ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు మాత్రమే ఏకైక ఆధారం. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్ కావడంతో ధరల్లో పురోగతి అనేది లేదు. ధరలు లభించనపుడు ప్రభుత్వం చొరవ తీసుకొని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ను రంగంలోకి దించాల్సిన అవసరం ఉంది. 20 రోజులుగా అధికారులు అదిగో.. ఇదిగో కొనుగోలు కేంద్రాలంటూ.. హడావుడి చేస్తున్నప్పటికీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఈ పరిస్థితుల్లో దళారులు చెప్పిందే రేటు.. మిల్లర్లు బోర్డుపై రాసిందే ధరే శాసనం అన్నట్లుగా ఉంది. కొనుగోళ్ల విషయంలో వ్యాపారులు, దళారులదే పైచేయిలా కనిపిస్తోంది. ఈసారి తెల్లబంగారం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా మద్దతు ధర అందక పోవంతో రైతు తెల్లమొహం వేస్తున్నాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది 3.2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అధికారుల అంచనా. ఒక్క కర్నూలు జిల్లాలోనే 2 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కావడం విశేషం. గతంతో పోలిస్తే ఈ ఏడాది తుపాన్ల ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తుండటం, చీడ–పీడల బెడద తక్కువగా ఉండటంతో దిగుబడులు గణనీయంగా వస్తున్నాయి. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు వస్తోంది. అయితే మద్దతు ధరలు లేక నష్టపోతున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి పత్తి మద్దతు ధరను కేంద్రం ప్రకటించింది. సీసీఐ 2024–25 సంవత్సరానికి గాను పత్తికి మద్దతు ధరలు నిర్ణయించింది. పొడుగు పింజ రకం క్వింటం రూ.7,521, పొట్టిపింజ రకం రూ.7,121లుగా నిర్ణయించింది. అయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు మరింత జాప్యం

మద్దతు ధర కంటే మార్కెట్‌లో ధర పడిపోయినప్పుడు రైతులు నష్ట పోకుండా ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలి. ప్రస్తుతం క్వింటం రూ. 7,000 వరకు మాత్రమే ధర లభిస్తోంది. ధరలు పడిపోయి రైతులు నష్టపోతున్నా మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్క కొనుగోలు కేంద్రం కూడా అందుబాటులోకి రాలేదు. మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు సెంటరు వారీగా జిన్నింగ్ మిల్లులను గుర్తించి సీసీఐకి పంపినప్పటికీ స్పందన లేకుండా పోయింది. ఆదోనిలో ఐదు, ఎమ్మిగనూరులో 4, మంత్రాలయంలో 2, పెంచికలపాడులో ఒకటి ప్రకారం మొత్తం 12 జిన్నింగ్ మిల్లుల్లో మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు నాలుగు రోజుల క్రితం ఆమోదం తెలిపారు. అయితే వాటిని సీసీఐ కూడా ఆమోదించాల్సి ఉంది. ఆ తర్వాతనే రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ మొదలయ్యేందుకు మరింత జాప్యమయ్యే అవకాశం ఉంది.

దళారీలదే హవా....

సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రశ్నార్థకం కావడంతో రైతులు దళారీల బారిన పడుతున్నారు. ధర ఇంకా పడిపోతుందని దళారులు.. రైతులను ఆందోళనకు గురి చేసి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పంట ఉత్పత్తులు మార్కెట్‌లోకి రాకముందే ఆర్‌బీకేల వారీగా కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉండేవి. ధరలు పడిపోయినపుడు మద్దతు ధరతో అమ్ముకోవడం జరిగేది. ఇపుడు రైతుల బాగోగులు పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ఆరుగాలం కష్టించి పంటను పండించిన రైతన్నకు కష్టాలు, నష్టాలే మిగులుతున్నాయి. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై పత్తి క్వింటం ధర రూ.5,500 నుంచి రూ.6,200 లోపే కొనుగోలు చేస్తున్నారు. ఒకటి, రెండు లాట్లను నామమాత్రంగా రూ.7వేలకు పైగా ధర చూపుతూ అటు రైతులను, ఇటు అధికారులను మభ్యపెడుతున్నారు. మిల్లర్ల సిండికేట్ మాయాజాలంలో రూ. 8 వేలకు పైగా ఉండాల్సిన పత్తి ధరలు ఏకంగా రూ. 6వేలకు పడిపోయాయి.

త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం



కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా త్వరలోనే పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే జిల్లాలోని ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెంచికలపాడుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిన్నింగ్ మిల్లులను గుర్తించాం. ఒకటి, రెండు రోజుల్లో సీసీఐ అనుమతి లభించే అవకాశం ఉంది. రైతులు మద్దతు ధరతో అమ్ముకునేందుకు ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్‌లకు అవకాశం కల్పిస్తాం.

– నారాయణమూర్తి, సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ

క్వింటానికి రూ.1,500 నష్టం



ఆరు ఎకరాల్లో పత్తి సాగు చేశాం. ఎకరాకు పెట్టుబడి రూ.40 వేల వరకు పెట్టాం. ఇటీవల 7 క్వింటాళ్ల పత్తిని ఆదోని మార్కెట్‌లో అమ్ముకున్నాం. క్వింటం కేవలం రూ.6000 మాత్రమే ధర లభించింది. శుక్రవారం మరో ఆరు క్వింటాళ్లు తెచ్చాం. వ్యాపారులు రూ.6,400 ప్రకారం కొనుగోలు చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే మద్దతు ధర రూ.7,500 లభించేది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో క్వింటానికి రూ.1500 వరకు నష్టం వాటిల్లింది.

– రవి, పాలకుర్తి, దేవనకొండ మండలం

ఇట్లయితే రైతులు ఎట్ల బాగు పడతారు



కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో విధిలేక ఆదోని మార్కెట్‌కు పత్తిని తేవాల్సి వస్తోంది. ఒకటిన్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాం. అధిక వర్షాలతో కొంత పంట దెబ్బతినింది. మొదటి దఫా 5 క్వింటాళ్ల పత్తి తీసి ఆదోని మార్కెట్‌కు తెచ్చి క్వింటం రూ.6,300 ప్రకారం విక్రయించా. ఒకటిన్నర ఎకరాల్లో పత్తి సాగుకు రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టా. ఇప్పటి వరకు 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇలాగైతే రైతులు ఎట్లా బాగుపడతారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ప్రభాకర్, లక్కందిన్నె, దేవనకొండ మండలం

అక్రమంగా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ బిందు మాధవ్



కర్నూలు (టౌన్): ఎవరైనా అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్ డివిజన్‌లలో టపాసుల విక్రయాలు నిర్వహించే ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు తావు లేకుండా విక్రయదారులకు సరైన భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. నీరు, ఇసుక తదితర అగ్ని మాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలను దుకాణాల్లో ఉంచుకోరాదన్నారు. లైసెన్సులు కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా అమ్మకాలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్–100, డయల్ 112కి తెలియజేయాలని ప్రజలను కోరారు.

అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి అండర్–19 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 ఆధ్వర్యంలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 900 మంది క్రీడాకారులు తరలి వచ్చారు. వీరికి టౌన్ జూనియర్ కళాశాల, కోల్స్ జూనియర్ కళాశాల, స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో విడిది ఏర్పాటు చేశారు. అంతకు ముందు మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేశ్, డీవీఈఓ పరమేశ్వరరెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడారు. క్రీడలపై ఆసక్తి పెంచుకుని సాధన చేస్తే సులువుగా రాణించగలుగుతారని చెప్పారు.



మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు

మంత్రాలయం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి హుండీలో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు శుక్రవారం పూర్తయ్యింది. సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించి మొత్తం రూ.3,38,02,400 సమకూరినట్లు మఠం అధికారులు తెలిపారు. ఇందులో రూ.3,30,57,440 నగదు, రూ.7,44,960 నాణేలు, 136 గ్రాముల బంగారం, 1180 గ్రాముల వెండి ఉన్నట్లు వెల్లడించారు.

గడువులోపు ప్రీమియం చెల్లిస్తేనే బీమా

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో నోటిఫై చేసిన పంటలకు గడువులోపు ప్రీమియం చెల్లించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనకు అర్హత పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. శనగ, జొన్న, వేరుశనగ, ఉల్లి, టమాట పంటలకు డిసెంబరు 15లోపు, వరికి డిసెంబరు 31 వరకు ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా ఉండే శనగకు ఎకరాకు రూ.420, వరికి రూ.630, జొన్నకు రూ.297, వేరుశనగకు రూ.480, ఉల్లికి రూ.1,350, వాతావరణ ఆధారిత బీమా ఉండే టమాటకు రూ.1,500 ప్రకారం ప్రీమియం చెల్లించాలని సూచించారు. రుణాలు తీసుకునే రైతులకు బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయని, ఇతరులు బ్యాంకులు లేదా కామన్ సర్వీస్ కేంద్రాల్లో ప్రీమియం చెల్లించవచ్చని తెలిపారు. గడువులోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు.

గ్రామసభ అర్జీలన్నీ పరిష్కరించాలి

- సమీక్షా సమావేశంలో అధికారులతో జిల్లా కలెక్టర్



కర్నూలు(సెంట్రల్): గ్రామసభల్లో కోర్టు కేసుల అర్జీలు తప్పా మిగతావన్నీ పరిష్కరించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్, ఉపాధిహామీ, పీజీఆర్‌ఎస్, క్రాప్ ఇన్సూరెన్స్ అంశాలపై మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఇతర మండలాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూసమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల మొదటి వారం నుంచి డివిజన్ల వారీగా రెవెన్యూ అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నామని, రెవెన్యూ అంశాలపై పూర్తి స్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. ఉపాధి హామీ పనులు కల్పించడంలో ఆస్పరి, పత్తికొండ, హొళగుంద, సి. బెళగల్, చిప్పగిరి, వెల్దుర్తి, కర్నూలు అర్బన్, కోసిగి, తుగ్గలి, పెద్దకడబూరు మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. రబీలో నోటిఫై చేసిన పంటలకు రైతులు ప్రీమియం చెల్లిస్తేనే ఇన్సూరెన్స్ కవరేజీ వస్తుందన్నారు. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో మూడు నెలల నుంచి కర్నూలు మొదటి స్థానంలో ఉందని, ఈసారి కూడా ఆ స్థానంలో నిలిచేందుకు పక్కా ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాని, డీఆర్వో చిరంజీవి, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కమార్, పత్తికొండ ఆర్‌డీఓ భరత్ నాయక్ పాల్గొన్నారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యతనివ్వండి

కర్నూలు (సిటీ): జిల్లాలో సాగునీటి కాలువలు, ప్రాజెక్టుల కింద అత్యవసర పనులు చేపట్టేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సూచించారు. శుక్రవారం మంత్రి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కర్నూలు జిల్లాలో రూ.19 కోట్లతో 178 పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఆయా పనులను మొదలుపెట్టేందుకు ఇంజినీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలన్నారు. జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి, ఎల్‌ఎల్‌సీ ఈఈ సైలేష్ కుమార్, ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

ఉల్లి కొనుగోలు చేయలేం

- కర్నూలు మార్కెట్ యార్డులో చేతులెత్తేసిన వ్యాపారులు
- నేడు, రేపు మార్కెట్‌కు ఉల్లి తేవద్దని రైతులకు అధికారుల సూచన



ఉల్లి దిగుబడులతో నిండిన యార్డు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లిగడ్డలు వెల్లువెత్తుతుండటంతో కొనుగోలు చేయలేమని వ్యాపారులు చేతులెత్తేశారు. మార్కెట్‌లోకి రోజుకు 20 వేల క్వింటాళ్లు వస్తోంది మార్కెట్ నుంచి బయటికి కేవలం 6 వేల నుంచి 8 వేల క్వింటాళ్లే పోతోంది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ఉల్లిని బయటికి తరలించేంత వరకు ఉల్లి కొనుగోలు చేయలేమని ప్రకటించారు. దిగుబడులు పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాలకు పోవాల్సి ఉంది. జాప్యం జరిగితే నాణ్యత దెబ్బతింటుండటంతో వ్యాపారులు ఈ నిర్ణయం తీసుకుమన్నామని ప్రకటించారు. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. శుక్రవారం మార్కెట్‌లో ఉల్లిగడ్డలను అమ్ముకునేందుకు 50 వేల బస్తాలు వచ్చాయి. అంటే 20 వేల క్వింటాళ్లపైనే. నాలుగైదు రోజులుగా ఉల్లి పోటెత్తుతోంది. డిమాండ్‌కు అనుగుణంగా కాటాదారులు లేకపోవడం, తగినన్ని లారీలు లేకపోవడంతో కొనుగోలు చేసిన సరుకు బయటికి పోవడం తక్కువగా ఉంటోంది. ఇందువల్ల మార్కెట్‌లో అన్నివైపులా ఉల్లి పేరుకపోయింది. కొనుగోళ్లు ఆలస్యమైతే ధర అలాగే కొనసాగుతుందా అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. కొనుగోళ్లు నిలిచిపోవడంతో రోడ్డెక్కి ఆందోళన చేయకుండా రైతులను కమీషన్ ఏజెంట్లు శాంతింపచేశారు. మార్కెట్‌లో ఉల్లి పేరుకపోయి ఉన్నందున శని, ఆదివారాల్లో మార్కెట్‌కు ఉల్లి తీసుకురావద్దని సెక్రటరీ జయలక్ష్మి రైతులకు సూచించారు.

ఫోర్జరీ కేసులో టీడీపీ నాయకుడికి జైలు శిక్ష

సాక్షి, నంద్యాల: ఖాదీ విలేజ్ కమిషనర్ ఏడీ సంతకాన్ని ఫోర్జరీ చేసిన కేసులో బనగానపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు, సీనియర్ న్యాయవాది కృష్ణారెడ్డికి శుక్రవారం న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. కోర్టు వర్గాలు తెలిపిన వివరాల మేరకు.. యాగంటి గ్రామీణ సేవా అసోసియేషన్ సెక్రటరీగా ఉన్న సమయంలో ఏడీ సంతకాన్ని ఫోర్జరీ చేసి కృష్ణారెడ్డి బనగానపల్లె సిండికేట్ బ్యాంకులో రూ. 10 లక్షలు విత్‌డ్రా చేశారు. 2022వ సంవత్సరంలో ఖాదీ విలేజ్ కమిషనర్ అధికారుల ఫిర్యాదుతో అప్పట్లో బనగానపల్లె పోలీస్‌స్టేషన్‌లో కృష్ణారెడ్డిపై కేసు నమోదైంది. కేసులో సాక్షాధారాలు రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష, రూ. రెండువేలు జరిమానా విధిస్తూ ఇన్‌చార్జ్ న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ తీర్పునిచ్చినట్లు కోర్టు వర్గాలు వెల్లడించాయి.

క్లుప్తంగా

ఎడ్ల బండి బోల్తాపడి రైతు మృతి


ఉరుకుందు (ఫైల్)

ఆస్పరి: మండలంలోని దొడగొండ గ్రామంలో శుక్రవారం ఎడ్ల బండి కింద పడి ఉరుకుందు (50) అనే రైతు మృతి చెందారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. రైతు ఉరుకుందు శుక్రవారం సొంత పత్తి పొలంలో గుంటక పాసి కలుపు మొక్కలు ఏరి పారేశారు. పనులు ముగిసిన తరువాత ఎడ్ల బండిపై వస్తుండగా ఎద్దులు బెదిరి అడ్డదిడ్డంగా పరుగులు తీయడంతో బండి బోల్తా పడింది. రైతు ఉరుకుందు కిందపడగా ఆయనపై ఎడ్ల బండి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ పెద్దదిక్కు అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడుకి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వాగులో పడి వ్యక్తి..

డోన్ టౌన్: పట్టణంలోని చాకిరేవు మిట్ట వద్ద వాగులో పడి చాకలి ఆశోక్ (28) మృతి చెందినట్లు పట్టణ పోలీసులు శుక్రవారం తెలిపారు. చాకలి ఈశ్వరయ్య కుమారుడైన ఆశోక్ మద్యానికి బానిసై ఇంటికి కూడా సక్రమంగా వెళ్లేవాడు కాదు. దీంతో విసుగు చెందిన భార్య కొద్ది నెలల క్రితం భర్తను వదిలి పుట్టింటికి వెళ్లింది. ఈ స్థితిలో రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆశోక్ మృతదేహం చాకిరేవు మిట్ట కింద వంక పక్కన ఉన్న వాగులో లభ్యమైంది. ప్రమాదవశాత్తు వాగులో పడడంతో నీట మునిగి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతునికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం


మహేష్ (ఫైల్)

దేవనకొండ: మండలంలోని అలారుదిన్నె గ్రామంలో ఆరేళ్ల బాలుడు అదృశ్యమయ్యాడు. గ్రామంలో ఆవుల నరసన్న, సోమేశ్వరి దంపతులకు కుమారుడు మహేష్ (06) ఉన్నాడు. శుక్రవారం వారు పొలంలో పత్తి తీయేసేందుకు వెళ్తూ కుమారుడిని వెంట తీసుకెళ్లారు. దంపతులు పనుల్లో నిమగ్నం కాగా పొలం పక్కనే ఉన్న హంద్రీనీవా సమీపంలో బాలుడు ఆడుకుంటున్నాడు. కొద్ది సేపటి తర్వాత కుమారుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనతో పొలమంతా గాలించినా ఆచూకీ కనిపించలేదు. అయితే బాలుడు ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న హంద్రీనీవా కాల్వలో పడిపోయాడా.. ఎవరైనా ఎత్తుకెళ్లారా అనేది దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

వ్యక్తి మృతదేహం లభ్యం

నందికొట్కూరు: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని ముళ్లపొదలలో చాకలి శ్రీనివాసులు (44) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్ఐ సురేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. ముళ్లపొదలలో వ్యక్తి మృతదేహం పడిఉన్నట్లు అటువైపు పొలాలకు వెళ్తున్న రైతులు సమాచారం అందించారన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని చెప్పారు. మృతుడి వద్ద ఆధారాలు పరిశీలించగా కర్నూలు మండలం ఉల్చాల గ్రామమని తేలిందన్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో రెండు, మూడు రోజుల క్రితం చనిపోయినట్లు తెలుస్తోందని చెప్పారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. భార్య చాకలి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పశువుల లెక్క.. ఇక పక్కా

- ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో పశుగణన
- విధుల్లో 196 మంది ఎన్యూమరేటర్లు, 52 మంది సూపర్‌వైజర్లు
- ఫిబ్రవరి 28 వరకు నిర్వహణ
- మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు
- లాంఛనంగా ప్రారంభించిన మంత్రి టీజీ భరత్
- టీకాల తయారీ, పథకాల రూపకల్పనకు పశుగణన ప్రామాణికం


పశుగణన కార్యక్రమాన్ని చేపట్టిన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): 21వ అఖిల భారత పశుగణనకు రంగం సిద్ధమైంది. ఐదేళ్లకోసారి జాతీయస్థాయిలో పశుగణన జరుగుతుంది. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబరు 1న ప్రారంభించి డిసెంబరు 31లోపు ముగించే విధంగా కేంద్రం షెడ్యూలు ఇచ్చింది. అప్పట్లో వాయిదా పడిన పశుగణన ఈ నెల 26 నుంచి పూర్తిస్థాయిలో మొదలుకానుంది. ఫిబ్రవరి 28 వరకు జరుగుతుంది. గురువారమే ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ యాప్ అందుబాటులోకి రాకపోవడంతో శనివారం నుంచి చేపట్టనున్నారు. అయితే కేంద్రం ఆదేశాల మేరకు పశుగణనను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి టీజీ భరత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నేటి నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లి పశుగణన చేపడుతారు. దీనికి సంబంధించి ఆగస్టు నెలలోనే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు.

స్వాతంత్య్రానికి ముందు నుంచే పశగణన

దేశానికి స్వాతంత్య్రం రాకముందు నుంచే పశుగణన జరుగుతోంది. ఇప్పటివరకు 20 సార్లు పశుగణన చేపట్టారు. మొదటి పశుగణన 1919-20 సంవత్సరంలో జరిగింది. తాజాగా 21వ గణన చేపట్టనున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పశువులు ఉన్నా.. లేకున్నా ప్రతి ఇంటికి వెళ్లి పశువులపై ఆరా తీయాలి. పశు గణన చేపట్టామనేందుకు ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించాల్సి ఉంది. స్టిక్కర్లు, పోస్టర్లు తదితర సామగ్రి మొత్తం జిల్లాకు ఆగస్టులోనే వచ్చాయి. అన్ని రకాల పశువులను లెక్కిస్తారు. వీధి కుక్కలను మాత్రం పరిగణలోకి తీసుకోరు. వీధి కుక్కలపై గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు ఇచ్చే వివరాలను నమోదు చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. యాప్‌లో ప్రావిజన్ ఉన్న అన్ని రకాల పశువులను లెక్కించాల్సి ఉంది.

ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లదే బాధ్యత

పశుగణనకు జిల్లా పశుసంవర్ధక శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. అనిమల్ హజ్బెండరీ సహాయకులు (ఏహెచ్ఏ), ఇతర పారా సిబ్బంది ఎన్యూమరేటర్లుగా నియమితులయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 2500 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్, అర్బన్ ప్రాంతాల్లో ప్రతి 3 వేల ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ ఉంటారు. ప్రతి ఐదు మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ఉంటారు. వెటర్నరీ అసిస్టెంటు సర్జన్లు, ఏరియా హాస్పిటల్స్ ఏడీలు సూపర్ వైజర్లుగా వ్యవహరించారు. జిల్లాస్థాయిలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ వ్యవహరిస్తారు. పశుగణనలో ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నలు, కుక్కలు, గాడిదలు, పందులు, కుందేళ్లు, గొర్రెలు, మేకలు, కోళ్ల, గుర్రాలు, ఒంటెలు ఇలా అన్నింటినీ లెక్కిస్తారు. ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మేర రెమ్యూనరేషన్ చెల్లిస్తారు.

పశుగణనకు ఎంతో ప్రాముఖ్యత

పశుగణనకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. పశువులు, కోళ్ల సంఖ్యను బట్టి కేంద్రం టీకాలు ఉత్పత్తి చేస్తుంది. పశుగణన ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతాయి. టీకాల తయారీ, పథకాల రూపకల్పనకు పశుగణన ప్రామాణికం. అందువల్ల పశుగణనను పకడ్బందీగా నిర్వహించాల్సి ఉంది. ఫిబ్రవరి 28వ తేదీ వరకు అవకాశం ఉన్నందున ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా గణన నిర్వహించాలి.

పక్కా వివరాలు ఇవ్వండి

21వ పశుగణన కార్యాక్రమానికి లాంఛనంగా శ్రీకారం చుట్టాం. జిల్లాలో 20వ పశుగణన ప్రకారం 17.90 లక్షల పశువులు, 5.84 లక్షల కోళ్లు ఉన్నాయి. 21వ పశుగణన ఫిబ్రవరి 28 వరకు జరుగుతుంది. ఇందుకోసం 196 మంది ఎన్యూమరేటర్లు, 52 మంది సూపర్‌వైజర్లను నియమించాం. పశువులు ఉన్నా లేకున్నా.. ప్రతి నివాసానికి ఎన్యుమరేటర్లు వస్తారు. వారికి కచ్చితమైన వివరాలు ఇవ్వాలి. పశుగణనకు ప్రజలు సహకరించాలి. – జి.శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, కర్నూలు

మిద్దె పైకప్పు కూలి మహిళ మృతి


ఉమామహేశ్వరమ్మ మృతదేహం

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసుస్టేషన్ పరిధిలోని సుంకులాపురం గ్రామంలో మిద్దె పైకప్పు కూలి ఉమామహేశ్వరమ్మ (40) అనే మహిళ మృతి చెందింది. ఎస్ఐ వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాజంరెడ్డి రామసుబ్బారెడ్డి సతీమణి ఉమామహేశ్వరమ్మ మధ్యాహ్నం ఇంట్లో ఉండగా ఆకస్మాత్తుగా మిద్దె పైకప్పు కూలి ఆమెపై పడింది. తలకు బలమైన గాయం కావడంతో పాటు ఊపిరి అందక ఉమామహేశ్వరమ్మ అక్కడక్కడే మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

56 మంది వీఏఏలకు పదోన్నతి

కర్నూలు(అగ్రికల్చర్): రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జీలుగా పనిచేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)లకు వ్యవసాయ శాఖ పదోన్నతులు కల్పించింది. ఉమ్మడి జిల్లాలో 56 మందికి వీఏఏలకు పదోన్నతులు లభించాయి. వీఏఏలకు పదోన్నతులు కల్పించే ప్రక్రియను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చేపట్టగా.. ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. ఉమ్మడి జిల్లాకు 580 వీఏఏ పోస్టులు మంజూరు కాగా... 534 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారు. వీఏఏ పోస్టుల భర్తీకి నిర్వహించిన పోటీ పరీక్షల్లో వచ్చిన మెరిట్ ప్రాతిపదికన పదోన్నతి కల్పించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు..రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం మెరిట్ ఆధారంగా పదోన్నతులు కల్పించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి వీఏఏలకు ఏతవోలుగా పదోన్నతి, పోస్టింగ్ ఉత్తర్వులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవి ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో బాధితులకు న్యాయం చేయండి


మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): చోరీ కేసుల్లో రికవరీ శాతం పెంచి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సూచించారు. ఆయన శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్లలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఎస్పీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లాంగ్ పెండింగ్, గ్రేవ్, మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్టులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. సబ్ డివిజన్ల వారీగా పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దొంగతనాల కేసులను ఛేదించాలన్నారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. కప్పట్రాళ్ల గ్రామంలో యురేనియంపై అపోహలు వస్తున్నాయని, అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళల మిస్సింగ్ కేసులపై దృష్టి పెట్టాలన్నారు. ట్రాఫిక్ సూచనలను తెలిపే సైన్ బోర్డులు, వేగ నియంత్రికాలు, జిగ్ జాగ్ సూచికలు, స్టాప్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్ల వారీగా వివిధ కేసుల్లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. డీఎస్పీలు బాబు ప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు, ఎస్ఐలు శ్రీనివాసులు, మహేష్‌కుమార్, విజయ్‌కుమార్, తిమ్మారెడ్డి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

మహిళపై టీడీపీ మూకదాడి


దాడిలో తీవ్రంగా గాయపడిన మైమున్నిసాబీ

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ మజారా కృష్ణానగర్ గ్రామంలో మైమున్నిసాబీ అనే మహిళపై టీడీపీ మూకలు దాడి చేసి గాయపరిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం బాధితురాలి కుమారుడు షేక్ ఉశేన్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 19వ తేదీన తాము ఇంటి స్లాబు నిర్మాణం కోసం సెంట్రింగ్ పనులు చేసుకుంటుండగా టీడీపీకి చెందిన తోట నారాయణ, అటికెల ప్రసాద్, రాజేశ్వరరావు, ఆయన భార్య రమణమ్మ మూకుమ్మడిగా దాడి చేశారన్నారు. తన తల్లి మైమున్నిసా తలపై రమణమ్మ ఇనుప చువ్వలున్న కర్రతో బలంగా కొట్టడంతో తీవ్ర గాయమై కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అటికెల ప్రసాద్ పరుష పదజాలంతో బూతులు తిడుతూ కొడవలితో దాడి చేసేందుకు వచ్చినట్లు చెప్పారు. ఇంటి స్లాబు నిర్మాణం కోసం తెచ్చిన సెంట్రింగ్ ముందుకు వేస్తున్నామని ఆరోపిస్తూ హత్యాయత్నానికి ఒడిగట్టారన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఘటనపై ఎస్ఐ సురేష్‌బాబు మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదు కేసు నమోదు చేశామని, డీఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బందితో కృష్ణానగర్ గ్రామానికి వెళ్లి విచారించినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై క్షుద్రపూజ


ఇంటిపై క్షుద్రపూజ చేసిన ఆనవాళ్లు

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త నేలకోసిగి గోవిందురాజు, ఈరమ్మ దంపతుల కొత్తగా నిర్మించికుంటున్న ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజ చేసి వెళ్లడం కలకలం రేపుతోంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. తాము ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి వ్యవసాయం, పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. చాలా ఏళ్ల తరువాత ఇల్లు నిర్మించుకుంటున్నాం. నిర్మాణం పూర్తి చేసి కార్తీక మాసంలో ఇంట్లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో గిట్టని వ్యక్తులు ఇంటిపై నిమ్మకాయలు, కుంకుమ, వివిధ రకాల వస్తువులతో క్షుద్ర పూజ చేసి వెళ్లారని కుటుంబసభ్యులు వాపోయారు. క్షుద్రపూజ సామగ్రితో పాటు చిత్తు కాగితాలపై కుజగ్రహం, చంద్రగ్రహణం, గురుగ్రహం రావి, రాహుగ్రహం గరిక, శనిగ్రహం పూజ, బుధగ్రహ ఉత్తరేణి, రావిగ్రహ జిల్లేడు, రవి గ్రహం జిల్లేడు అని రాసి ఉన్నట్లు చెప్పారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. క్షుద్రపూజ వస్తువులను చూసి కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురౌతున్నారు.

30న కుస్తీ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాస్థాయి కుస్తీ ఎంపిక పోటీలు ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు నంద్యాల జిల్లా రెజ్లింగ్ సెక్రటరీ రాబర్ట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు సీనియర్ మెన్ ఫ్రీ స్టైల్, మెన్ గ్రీకో రోమన్ స్టైల్, ఉమెన్ ఫ్రీ స్టైల్ విభాగంలో వివిధ బరువుల కేటగిరీల్లో పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి గ్రూపు నుంచి ప్రథమ స్థానం గెలిచిన విజేతలను నవంబర్ 9, 10 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు రాబర్ట్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు మూడు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, రూ.30 ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీల్లో పాల్గొనాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ 9676095979 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రిష్ణాపురంలో వ్యక్తి దారుణహత్య

- ఇద్దరు పిల్లలతో పరారీలో భార్య


హత్యకు గురైన ఆదినారాయణ రెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం క్రిష్టాపురం గ్రామంలో చిట్యాల ఆదినారాయణ రెడ్డి (35) అనే వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. తరచూ మద్యం సేవించి భార్యను వేధించే ఆదినారాయణ రెడ్డి శుక్రవారం తలపై గొడ్డలి వేటుతో మరణించాడు. వివరాలు.. రెండు రోజులుగా ఆదినారాయణ రెడ్డి భార్య లక్ష్మీదేవితో ఘర్షణ పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మీదేవి ఇంటికి తాళం వేసి ఇద్దరు పిల్లలతో ఎక్కడికో వెళ్లిపోయింది. అందరూ ఆమె పుట్టింటికి వెళ్లి ఉంటుందని అనుకున్నారు. రాత్రి 8 గంటల సమయంలో ఇరుగుపొరుగు వారు.. ఆదినారాయణ రెడ్డి పగలంతా మద్యం తాగుతూ ఇంట్లోంచి బయటికే రాలేదు. అతడు ఇంట్లో ఉండగానే భార్య తాళం వేసి వెళ్లిందేమోనన్న అనుమానంతో కిటికీ నుంచి లోపలికి చూడగా రక్తపు మడుగులో పడిపోయి కనిపించాడు. తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే నారాయణ రెడ్డి మరణించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ముచ్చుమర్రి ఘటన నిందితులకు బెయిల్

సాక్షి, నంద్యాల: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ముచ్చుమర్రి బాలిక హత్యాచారం ఘటనలో నిందితులకు బెయిల్ మంజూరైంది. క్రైం నంబర్ 69/2024 కేసులో ఆరుగురిని ప్రధాన నిందితులుగా చేర్చారు. నేరం జరిగి 90 రోజులు గడవడంతో పోలీసులు ప్రిలిమనరీ చార్జిషీట్ ఫైల్ చేశారు. దీంతో నిందితులు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాదనలు విన్న కర్నూలు పోక్సో కోర్టు ఏ4 కాటం యోహాన్, ఏ5 బొల్లెద్దుల సద్గురు అలియాస్ సద్గురుడు, ఏ6 అంబటి ప్రబేష్ అలియాస్ ప్రభుఏసులకు గురువారం బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం వారు విడుదలయ్యారు. ఇదే కేసులో కొద్ది రోజుల క్రితం ముగ్గురు మైనర్ నిందితుల్లో ఇద్దరికి జువైనల్ జస్టిస్ బోర్డు బెయిల్ మంజూరు చేసింది. చైల్డ్ ఇన్ కాంఫ్లిట్ విత్ లా(సీసీఎల్2)14 ఏళ్ల బాలుడు, సీసీఎల్3 అయిన తొమ్మిదేళ్ల బాలుడికి బెయిల్ మంజూరైంది. సీసీఎల్1 అయిన పదిహేనేళ్ల బాలుడు ప్రస్తుతం జువైనల్ జస్టిస్ హోంలో ఉన్నాడు.

కేసు నేపథ్యం ఇలా...

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికను జూలై 7న అదే గ్రామానికి చెందిన 15, 14, 9 వయసున్న ముగ్గురు మైనర్ బాలురు అత్యాచారం చేసి హత్య చేశారు. బాలిక తల్లిదండ్రులు అదే రోజున ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ప్రజా సంఘాల ఒత్తిడితో రెండు రోజుల తర్వాత నుంచి విచారణ ప్రారంభించారు. జులై 10న నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తే చిన్నారిని రేప్ చేసి చంపేసినట్లు నేరాన్ని ఒప్పుకున్నారు. నిందితులు బాలిక శవాన్ని మాయం చేయడంతో గుర్తించడంలో పోలీసులు పూర్తి వైఫల్యం చెందారని బాధితులు చెబుతున్నారు.

కర్నూలు నగరవనం వద్ద ఉద్రిక్తత

- స్థలం విషయంలో అటవీశాఖ, టీడీపీ నాయకుడి మధ్య వాగ్వాదం
- ఫారెస్ట్ వారు ఏర్పాటు చేసిన ప్రొటెక్షన్ బౌండరీ పోల్స్ కూల్చేసిన అనుచరులు


వాగ్వాదం చేసుకుంటున్న స్థలం ఆక్రమించుకున్న వారు, అటవీ శాఖ ఉద్యోగులు

కర్నూలు కల్చరల్, రూరల్: కర్నూలు నగర వనం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థలం విషయంలో అటవీ శాఖ అధికారులు, టీడీపీ నాయకుడి మధ్య వాగ్వాదం జరిగింది. నగర శివారులోని మిలటరీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు అదే గ్రామంలో ఓ ఆర్మీ ఉద్యోగి కుటుంబానికి సంబంధించిన 737/1 సర్వే నంబర్‌లోని 1.15 ఎకరాల భూమిని కొన్నట్లు అగ్రిమెంట్ చేసుకున్నారు. కొన్న భూమికి 136 సర్వే నంబర్‌లో ఉన్న ఫారెస్ట్, ఇరిగేషన్ శాఖల భూమి హద్దులు తొలగించి చదును చేసి రోడ్డు వేయించారు. గమనించిన ఫారెస్ట్ అధికారులు రోడ్డు వేసిన స్థలం ఆర్ఎఫ్‌కు సంబంధించినదని, అటవీ ప్రాంతాన్ని ఆక్రమించుకోవడం నేరమని తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రోడ్డు వేసిన ప్రాంతంలో బౌండరీ పోల్స్ ఏర్పాటు చేశారు. దీంతో శుక్రవారం టీడీపీ నాయకుడు 30 మంది అనుచరులు, అటుపక్క పొలాల్లో ఉన్న రైతులతో కలిసి వచ్చి బౌండరీ పోల్స్‌ను కూల్చేశారు. దీంతో ఆ శాఖ ఉద్యోగులు, టీడీపీ నాయకుడు, అనుచరుల మధ్య వాగ్వాదం జరిగింది. 1891 గెజిట్ ప్రకారం ఇది రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించిన స్థలమని మీ దగ్గర స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్ ఉంటే చూపించాలని అటవీ శాఖ ఉద్యోగులు కోరగా.. అది తన స్థలమేనని రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు రోడ్ వేసుకోమని చెప్పారని టీడీపీ నాయకుడు వాదించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తమ బౌండరీ పోల్స్ తొలగించడం నేరమని పోలీస్‌లకు పిర్యాదు చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామాంజనేయులు అక్కడికి చేరుకొని ఇరు వర్గాలతో మాట్లాడారు. 136 సర్వే నంబర్‌లో ఉన్న భూమి ఎవరిదో తేలే వరకు అందులోకి ఎవరూ వెళ్లరాదని ఇరువర్గాలకు సర్దిచెప్పారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం



పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామం సమీపంలో ఎల్ఎల్‌సీ (సూగూరు మేజర్ కాలువ)లో గుర్తు తెలియని మహిళ మృతదేహం కొట్టుకొచ్చింది. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. దాదాపు 60 సంవత్సరాల వయసు గల మహిళ మృతదేహం సూగూరు మేజర్ కాలువలో కొట్టుకుపోతుండగా స్థానికులు సమాచారం అందించారన్నారు. ఘటనా స్థలానికి చేరుకుని కాలువలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతురాలు నీలం రంగు జాకెటు, వివిధ రంగుల గీతల చీర ధరించిఉన్నట్లు చెప్పారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 91211 01154, 91211 0116 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పిచ్చికుక్క దాడిలో విద్యార్థులకు గాయాలు


పిచ్చికుక్క దాడిలో గాయపడిన బాలుడు

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట గ్రామంలో శుక్రవారం పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపరచింది. పిచ్చికుక్క దాడిలో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. 7వ తరగతి చదువుతున్న కురువ మహేష్ పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి వస్తుండగా కుక్క దాడిచేసి అందినకాడల్లా కరిచింది. బాలుడి చేతులు, కాళ్లు, మొడ, భుజంపై, తల దగ్గర గాయాలయ్యాయి. అలాగే గ్రామానికి చెందిన మరో బాలుడిపై కుక్క దాడి చేసి కరిచింది. గాయపడిన ఇద్దరు బాలురను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చి కుక్క రెచ్చిపోవడంతో స్థానికులు భయందోళనలకు గురవుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకుని వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బండిఆత్మకూరు: మండల పరిధిలోని జీసీ పాలెం-నారపురెడ్డి కుంట సమీపంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ జగన్‌మోహన్ తన సిబ్బందితో వెళ్లి అరెస్ట్ చేశారు. లింగాపురం గ్రామానికి చెందిన నలుగురిని, ఆత్మకూరు, నారాయణాపురం, నారపురెడ్డి కుంట గ్రామాలకు చెందిన ఒక్కొక్కరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.54,800 నగదు, 4 బైకులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

డోన్ కమిషనర్ అత్యుత్సాహం!


మున్సిపల్ కార్యాలయ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి బుగ్గన, చైర్మన్ సప్తశైల రాజేష్ తదితరులు


రహదారిపై అనుచరులతో కలిసి వాకింగ్ చేస్తున్న మాజీ మంత్రి

మాజీ మంత్రి బుగ్గన వస్తున్నారని మున్సిపల్ కార్యాలయానికి తాళం

- మూడు గంటల పాటు ఫోన్లు స్విచ్చాఫ్‌లో ఉంచిన వైనం
- ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేసిన మాజీ మంత్రి, మున్సిపల్ చైర్మన్లు
- చిల్లర రాజకీయాలు మానుకోవాలని అధికార పార్టీ నేతలకు బుగ్గన హితవు

డోన్: డోన్ మున్సిపల్ నూతన కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అత్యుత్సాహంతో అభాసుపాలయ్యారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎప్పటిలాగానే డోన్‌కు వచ్చినప్పుడల్లా మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని ట్రాక్‌లో వాకింగ్ చేసేవారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆయన వాకింగ్‌కు వస్తున్నారని తెలిసి కమిషనర్ ప్రసాద్‌గౌడ్ మున్సిపల్ కార్యాలయ ప్రధాన ద్వారాలకు తాళాలు వేసుకొని వెళ్లడమే గాకుండా సెల్‌ఫోన్‌ను స్విచ్చాఫ్ చేసుకున్నారు. దాదాపు రెండు గంటల పాటే అక్కడే ఉన్నా ఒక్కరూ కూడా రాలేదు. ప్రతి రోజు తెల్లవారుజామున 4 గంటల నుంచే అక్కడ మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బందికి డ్యూటీ చార్ట్ వేసేందుకు అధికారులు చేరుకునే వారు.శుక్రవారం మాత్రం తాళం వేయడంతో మాజీ మంత్రితో పాటు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు కమిషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గంటల పాటు నిరీక్షించిన అనంతరం వారు పాతబస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు నిర్మించిన బుగ్గన శేషారెడ్డి మార్గ్‌లో గంటపాటు వాకింగ్ చేశారు. అనంతరం క్లబ్‌హౌస్ సమీపంలో ఫుట్‌పాత్‌పై కూర్చొని కమిషనర్, అధికార పార్టీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల తర్వాత మున్సిపల్ కార్యాలయ ప్రధాన ద్వారానికి వేసిన తాళం తీశారు.

రాజకీయ అనుభవాన్ని అభివృద్ధికి ఉపయోగించండి.. బుగ్గన

ఇటీవల జరిగిన ఎన్నికల్లో తమ ఓటమిని హుందాగా అంగీకరించిన విషయాన్ని మాజీ మంత్రి బుగ్గన గుర్తుచేస్తూ ఇప్పుడు ఉన్న ప్రజాప్రతినిధులు తమ అనుభవాన్ని డోన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు వినియోగించాలని హితవు పలికారు.ప్రజోపయోగకర పనులు చేపట్టి ప్రజల మెప్పు పొందాలే కానీ చిల్లర రాజకీయాలు చేసి ప్రజల్లో అభాసుపాలు కావొద్దని అధికార పార్టీ నాయకులకు పరోక్షంగా సూచించారు. రోడ్డుపై నడిస్తే రోడ్డు బంద్ చేయిస్తారా అని కమిషనర్‌ను నిలదీశారు. ఒక పౌరునిగా ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దిన వాకింగ్ ట్రాక్‌పై వాకింగ్ చేయడం నేరమా అని ఆయన ప్రశ్నించారు.